



స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

అరెస్టా.. విచారణా..?



◆ మాధవ్ పరిస్థితి ఏంటో ?

◆ నేడు సైబర్ పోలీసుల ఎదుట విచారణకు హాజరు

◆ మద్దతుదారులతో బయలుదేరిన మాజీ ఎంపి మాధవ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అరెస్టు చేస్తారా, లేక విచారించి పంపుతారా అన్నదానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది. గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ పోలీసులు ఈనెల ఐదవ తేదీన విచారణకు హాజరుకావాలని నోటీసులిచ్చారు. ఈ నోటీసులు అందుకున్న ఆయన 5వ తేది కాకుండా ఒక రోజు అదనంగా గడువు అడిగి బుధవారం నాడు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. వెళ్లే ముందు మీడియాతోనూ మాట్లాడి వెళ్లారు. ప్రతిపక్ష నాయకులపై అనవసరమైన కేసులు పెడితే తిరుగుబాటు తప్పదని చెప్పారు. ప్రభుత్వం దాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తాను పోలీసు విచారణకు హాజరవుతున్నట్టు కూడా చెప్పారు. ఒక యువతి అత్యాచారం కేసులో ఆమె పేరును ప్రస్తావించడం నేరమని మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మాధవ్‌పై చర్యలకు ఉపక్రమించారు. గురువారం నాడు ఆయన విచారణకు హాజరుకానున్నారు. ఈ విచారణ అనంతరం ఆయన్ను అరెస్టు చేస్తారా లేక విచారించి పంపిస్తారా అన్న దానిపై చర్చ నడుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు వైసిపి నాయకుల అరెస్టులు జరిగాయి. ఇప్పుడు మాధవ్‌ను కూడా చేస్తారా లేదా అన్నది రాజకీయవర్గాలు గమనిస్తున్నాయి. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో గోరంట్ల మాధవ్ అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకులపై తీవ్ర స్థాయిలోనే వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కూడా దుర్భషలాడారు. ఈ నేపథ్యంలో ఆయనపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

దూకుడుకు కళ్లెమేసేరా..?

పోలీసు అధికారిగానున్న గోరంట్ల మాధవ్ 2019 ఎన్నికల చివరి నిమిషంలో వైసిపిలో చేరారు. ఆయనకు హిందూపురం పార్లమెంటు టిక్కెట్టును ఖరారు చేశారు. వైసిపి గాలిలో ఆయన విజయం సాధించారు. ముందు నుంచి దూకుడుగా ఉండే గోరంట్ల మాధవ్ ఎంపి అయిన తరువాత కూడా తెలుగుదేశం పార్టీపై తనదైన శైలిలో విమర్శలు చేస్తూ వచ్చేవారు. ఒక మహిళతో న్యూడ్‌గా వీడియో కాల్‌లో మాట్లాడే వీడియో ఒకటి బయటకు వచ్చింది. అది ఆయన రాజకీయంగా కొంత దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో వైసిపి పూర్తిగా దెబ్బతినడంతో ఆయన రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలను పార్టీ అప్పగించింది. ఇప్పుడు ఆయనపై కేసులు నమోదవడం జరిగింది. ఆయన్ను ఈ కేసుల్లో జైలుకు పంపుతారా లేక విచారించి పంపిస్తారా అన్నది చర్చ నడుస్తోంది. ఆయన మాత్రం కేసులు పెట్టినా ఎదుర్కొంటామని చెబుతున్నారు.

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి పోరాటాలు

వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తి

◆ ఎర్రజెండా ఉన్నంతకాలం ఆయన గుర్తుంటారు..

◆ రైతుల గుండెల్లో చిరస్మరణీయుడు

◆ కామ్రేడ్ సుబ్బిరెడ్డి స్మారక స్థూపం ఆవిష్కరణలో సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్, ఓబులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి పోరాటాలు రైతు, కార్మిక, వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిగా నిలుస్తాయని సిపిఎం నాయకులు కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి ఇటీవల కన్నుమూశారు. సుబ్బిరెడ్డి స్వగ్రామం కదిరి మండలం వరిగిరెడ్డిపల్లిలో ఆయన స్మారక స్థూపాన్ని నిర్మించారు. బుధవారం నాడు కుటుంబ సభ్యులతో కలిసి సిపిఎం నాయకులు స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రధాన వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుబ్బిరెడ్డి తొలుత పాల ఉత్పత్తిదారుల సంఘం నుంచి ఉద్యమ పోరాటంలోకి వచ్చారన్నారు. తర్వాత రైతుసంఘం, సిపిఎంలో రైతులు, కూలీలు, కార్మికుల పక్షాన నాలుగు దశాబ్దాల పాటు అనేక పోరాటాలు సాగించారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతాంగం సాగించిన అనేక పోరాటాల్లో సుబ్బిరెడ్డి అగ్రభాగాన నిలిచారని తెలిపారు. కదిరి ప్రాంతంలో చెర్లోపల్లి రిజర్వాయర్ నిర్వాసితుల పక్షాన సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పూర్తి చేసి కదిరి ప్రాంతంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని రైతులతో సంఘటితం చేసి ఉద్యమాలు నిర్మించారన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో గంజి కేంద్రాలు ఏర్పాటు చేసిన సమయంలో వాటిని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేశారన్నారు. పట్టు పరిశ్రమ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామగ్రామాన తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఎన్‌పి.కుంట సోలార్ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూసేకరణ చేసినప్పుడు పరిహారం, పునరావాసం కోసం సాగించిన పోరాటంలో సుబ్బిరెడ్డి ముందుండి ఆందోళనలు సాగించారన్నారు. ప్రజా పోరాటాలతో ఆయనకున్న బంధం విడదీయలేదని చెప్పారు. ఎర్రజెండా ఉన్నంత వరకు కామ్రేడ్ సుబ్బిరెడ్డి పోరాటాలు సజీవంగా నిలుస్తాయన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల పక్షాన ప్రజా పోరాటాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నరసింహులు, అన్నదాత రామిరెడ్డి, రామకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జిఎల్.నరసింహులు, రైతు సంఘం నాయకులు హరి, కదిరప్ప, ప్రవీణ్ కుమార్, నాగిరెడ్డి, రమణ, శివన్న, వినోద్‌కుమార్, రాజారెడ్డి, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు శాంతిబాయి, మున్నీ, రమీజా, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, సుశీల, సిపిఎం నాయకులు బాబ్జాన్, జగన్మోహన్, ముస్తాక్, సాంబ, రామ్మోహన్, ప్రజాసంఘాల నాయకులు వేమన్న, ఆటో పెద్దన్న, రఫిక్, తిరుపాల్, బాలకృష్ణ, ఆంజనేయులు, రాజగోపాల్, పెడబల్లి బాబా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కూలీలందరికీ పనులు కల్పించాలి : పీడీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామాల్లో పనులు అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ సలీం బాషా తెలిపారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి, దయ్యాలకుంటపల్లి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను స్థానిక అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలన్నారు. ప్రతి కుటుంబమునకు 50 రోజులు అదనంగా పనులు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పోలేరయ్య, సాంకేతిక సహాయకులు కుళ్లాయి స్వామి, హనుమంత్ రెడ్డి, కృష్టప్ప, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ 2025 డైరీని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని యు.ఉమామహేశ్వరమ్మ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజేంద్రప్రసాద్, ఎస్.బాలాజీనాయక్, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, కల్చరల్ సెక్రటరీ హెచ్.ఆదం ఖాన్, ఉమ్మడి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సి.వి రమణారెడ్డి, కోశాధికారి ప్రణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం సమాచార హక్కు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఎ.వన్నూరప్ప ఆధ్వర్యంలో రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా అధికారుల్లో జవాబుదారీ తనం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్ కె.మాధవి, డా॥రామలింగమయ్య, వైస్ ప్రెసిడెంట్ భానుప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పోలీసులకు సత్కారం


ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో పని చేస్తున్న ర్యాంకు ప్రమోటీ ఎస్ఐ రంగస్వామి, ఎఆర్ఎస్ఐ తాజుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ నారప్పలు ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో వీరి ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజం కోసం వీరంతా సుమారు నాలుగు దశాబ్దాలు పాటు పోలీసు విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబంతో సాఫీగా గడపాలని ఆకాంక్షించారు. అనంతపురం పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డివి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు ఇస్మాయిల్, వెంకటేష్ నాయక్, ఆర్ఐలు మధు, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ పాల్గొన్నారు.

సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు : జెడిఎ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులకు సబ్సిడీ ద్వారా అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడిఎ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యంత్ర పరికరాలు, పిచికారీ యాత్రాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. ఇందుకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులకు 11 అంకెల యూనిక్ గుర్తింపు కార్డును అందిస్తున్నట్లు చెప్పారు. వచ్చే వేసవి కాలంలో రైతుల పొలంలో మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపి రైతులకు నివేదికలు అంజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్, ప్రకతి వ్యవసాయధికారి చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్, ఉద్యానసహాయకులు నరేష్, కావ్య, రైతులు పాల్గొన్నారు.



పొలం బడిలో పాల్గొన్న జెడిఎ ఉమా మహేశ్వరమ్మ

చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దు : సిఐటియు



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఎదుట ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, ఆటో, అంబులెన్స్ డ్రైవర్‌ల పొట్ట కొట్టే చర్యలను ఉప సంహరించుకోవాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి, నగర కార్యదర్శి ముత్తుజా డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తోపుడుబండ్ల కార్మికుల ఉపాధి పోగొట్టెలా మున్సిపల్ అధికారులు తోపుడు బండ్లు తొలగించాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ పక్కన 200 మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులుగా అంబులెన్స్ డ్రైవర్లు తోపుడుబండ్ల కార్మికులు అనేక వత్తులతో అక్కడ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాల నుంచి ఆసుపత్రిని నమ్ముకుని ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మీరు ఉన్నఫలంగా ఖాళీ చేయమని మున్సిపల్ టౌన్ ప్లాన్ అధికారులతో ఖాళీ చేయించమని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసిందన్నారు. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడం అన్యాయంగా ఉందన్నారు. యధావిధిగా అక్కడే వాళ్లకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తాను ఎవరికీ లేఖ రాయలేదని, ఎటువంటి అభ్యంతరం తెలుపలేదన్నారు. కార్మికుల పక్షాన అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు లతీఫ్, అంబులెన్స్ యూనియన్ కార్యదర్శి జిలాన్, తోపుడుబండ్ల సంఘం అధ్యక్షులు రమణ, రవి, రాజా, జయమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలపై 12న ధర్నా

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి



కూలీలతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈ నెల 12 తేదీ విజయవాడలో చేపట్టనున్న ధర్నాలో కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఎపి వ్యకాసం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కల్లుమడి, రాచేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసు కున్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ చేసిన పనికి సకాలంలో కూలి డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. 8 వారాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే కూలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పనులు కల్పించి వలసలను నివారించాలన్నారు. ప్రభుత్వాలు స్పందించి గ్రామాలకు దగ్గర్లోనే పనులు కల్పించాలని, ఆటో ఛార్జీలు, మజ్జిగ, తాగునీరు, నీడ, తదితర వసతులు కల్పించాలన్నారు. ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు రూ. 600 కూలి, కూలీలందరికీ పనిముట్లు, వడదెబ్బకు గురై చనిపోతే ఆ కుటుంబానికి రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎపి వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు సూర్యప్రకాష్, మునెప్ప, ఆదినారాయణ, కేశన్న, నల్లప్ప ఉన్నారు.

చిరు వ్యాపారుల బంకులు తొలగింపు

అడ్డుకున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు



నిరసన తెలుపున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని తిలక్‌నగర్‌లో రోడ్డు పక్కన మున్సిపాలిటీ స్థలంలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న బంకులను బుధవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తుండగా సిపిఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు అడ్డుకుని, తొలగింపును ఆపాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న 1, 2వపట్టణ సిఐలు మస్తాన్, మనోహర్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు ససేమిరా అనడంతో మున్సిపల్ అధికారులకు నచ్చచెప్పి బంకుల తొలగింపును నిలుపుదల చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.మహేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ స్థలంలో రోడ్డు పక్కన పేదలు కుటుంబాల పోషణకోసం చిన్న బంకులు పెట్టుకుని మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ట్రాఫిక్‌కు అంతరాయం అవుతుందని నోటీసులు ఇచ్చి బంకులు తొలగించేందుకు ఉపక్రమించడం దారుణమన్నారు. కమిషనర్ చిరు వ్యాపారులపై జులుం చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, షబ్బీర్, రాజేష్, ఎస్సీ, ఎస్టీ నాయకులు జెన్నే మస్తాన్, చిరు వ్యాపారులు మల్లేశ్వరి, మంజు, శంకర్, కసాపురం రాజు, బలరాం, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నియోజకవర్గంలో సమస్యలపై రాష్ట్ర మంత్రులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అమరావతిలో ఉన్న ఆయన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిశారు. నగరంలో నడిమి వంక, మరువవంక ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం మొత్తం రూ.88 కోట్ల వరకు రక్షణ గోడనిర్మాణానికి అవసరం అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ వసతి గహాల్లో నెలకొన్న సమస్యల గురించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ఆవరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ మూడు ఉన్నాయని అయితే అక్కడ భవనాలు పురాతనమైనవి కావడంతో వర్షాకాలం ప్రారంభం కాగానే వర్షపునీరు రావడం, పై పెచ్చులు ఊడిపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు సంఖ్యను దష్టిలో ఉంచుకొని అదనపు భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలన్నారు.

అభ్యంతరాలను సరి చేయండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఇటీవల విడుదల చేసిన సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలను సరి చేయాలని ఎపిటిఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లా విద్యా శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేసిన తాత్కాలిక సీనియార్టీ లిస్టు వివరాలపై జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల నుంచి వస్తున్న అభ్యంతరాలను సరిచేయాలన్నారు. అన్ని సబ్జెక్టుల, అన్ని కేడర్లలో నమోదు అయిన ఉపాధ్యాయుల వివరాలు వేలాది తప్పులు ఉన్నాయని తెలిపారు. ఈ పొరపాట్ల వల్ల వేలాది మంది జూనియర్లు సీనియార్టీ లిస్టులో పైకి వచ్చారని, సీనియర్లు జూనియర్లుగా కింద నమోదు అయ్యారని తెలిపారు. తక్షణం మరొకసారి కార్యాలయ సిబ్బంది జాబితాలను సరిచేసి విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రమణ, వన్నప్ప, సర్దార్ వలి, ఓబులేసు, కలియుల్లా, భాగ్యరాజ్, తిప్పేస్వామి, చిదంబర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 'పాదయాత్ర'

ఏపీ పండ్ల తోటలరైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాలో రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు ఏపీ పండ్ల తోటలరైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి తెలియజేశారు. బుధవారం నాడు మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో కేంద్రంలో పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్నల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వమే మిర్చి డబ్బి రకం, కడ్డీ రకానికి క్వింటాకు రూ.50 వేలతో సింజెంటా, ఇతర రకాల మిరపకు రూ.25 వేలతో కొనుగోలు చేయాలన్నారు. 2024-25 ఖరీఫ్ రబీలో నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా పదివేల రూపాయలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. షరతులు లేకుండా క్వింటా పత్తి రూ.పదివేలు కొనుగోలు చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన పాదయాత్రలో జిల్లాలోని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటకొండ, శ్రీనివాసులు, స్థానిక రైతు సంఘం నాయకులు సంజీవరెడ్డి, నారాయణస్వామి, వేణు, ఆదెప్ప, జయరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రామకృష్ణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు, పండ్లతోటల సంఘం నాయకులు

జెఎన్‌టియుకు రూ.15 కోట్లు విడుదల

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న అడిషనల్ గ్రాంట్ నిధులు రూ.15 కోట్లను బుధవారం విడుదల చేసింది. అనంతపురం జెఎన్‌టియు పరిధిలో బోధనా, బోధనేతర, అప్కాస్ కింద పని చేసే ఉద్యోగులకు డిసెంబర్ నుంచి చెల్లించాల్సిన వేతనాలు సమస్య వర్సిటీని వెంటాడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నిధులు విడుదల కావడంతో మూడు నెలలుగా వేతనాలు కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు మేలు జరగనుంది. ఉద్యోగ విరమణ చేసిన వారికీ పెండింగ్ అమౌంట్ వేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తెలిపారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరి నెలలలో నిర్వహించిన ఎంటెక్ ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లిమెంటరీ, రెండవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ, ఎంసిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ ఎంబిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. పరీక్షా పలితాల కోసం www.jntuaresults.inను సంప్రదించాలని డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివ కుమార్, అడిషనల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ ఎస్. శ్రీధర్ తెలిపారు.

జెఎన్‌టియు విద్యార్థికి విసి అభినందనలు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకు ఈసిఈ విభాగం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి డి.శివాజీని వైస్‌ఛాన్సలర్‌ను హెచ్.సుదర్శనరావు బుధవారం అభినందించారు. విద్యార్థి శివాజీ ఫేస్ ఆర్ట్ డ్రాయింగ్‌లో ప్రతిభ చాటారు. ఈయన గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయంటూ విసీ అభినందించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఘనంగా డాక్టర్ల గ్రాడ్యుయేషన్ వేడుక

హాజరైన కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వి.వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంకితభావంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని యువ వైద్యులకు సూచించారు. జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కెఎస్-ఎస్.వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్, బెనిడక్టర్, శంషాద్‌బేగం, సారన్ సోనియా, మధు, చలపతి, వైద్యులు పాల్గొన్నారు.

తిరుపతి రైలు రద్దు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

కదిరిదేవరపల్లి-తిరుపతి నడుమ ప్రయాణించే రైలు(57405/ 57406) రద్దు గడువును మార్చి 8 నుంచి 31వ తేదీ వరకూ పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లను నడిపిన కారణంగా ఈ రైలును కొంతకాలం పాటు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ రైలు రద్దు గడువు మార్చి నెలాఖరు వరకూ కొనసాగుతుందని తెలిపారు.

సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ పూజారి పద్మశ్రీ అధ్యక్షతన ఎకెఎస్ ఐఎఎస్ అకాడమీ, హైదరాబాద్ వారి సహకారంతో సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు ప్రిపరేషన్‌న అవగాహన సదస్సు నిర్వహించిరు. అకాడమీ ఇన్‌ఛార్జి నాగరాజు మాట్లాడుతూ సివిల్ సర్వీస్ ప్రిపరేషన్ పట్ల భయం వీడి సులభంగా ఎలా ప్రిపేర్ కావాలో విద్యార్థులకు వివరించారు. సదస్సులో వైఎస్ ప్రిన్సిపల్ సహదేవుడు, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు డాక్టర్ ఎం.బాలాజీనాయక్, అర్థశాస్త్ర విభాగాధిపతి దేవేందర్, రామచంద్ర, కేశాలు, డాక్టర్. నాగభూషణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

జడ్పీలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో కార్యాల యానికి వచ్చే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బయ్య, కార్యాలయ పరిపాలన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

సర్పంచి సొంత ఖర్చులతో పాఠశాలకు తాగునీరు

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలోని నక్కలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 15 రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచి రామిరెడ్డి బుధవారం సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా పాఠశాలకు తాగునీరు సరఫరా చేయించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ పరీక్షలో ఎన్.విఘ్నేష్ ప్రతిభ

ప్రజాశక్తి-ఉరవకొండ


ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎన్.విఘ్నేష్ అర్హత సాధించారు. విఘ్నేష్‌కు రాబోయే 4 ఏళ్ల పాటు నెలకు రూ. 2వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపకార వేతనం అందుతుంది. ఈ పరీక్ష కోసం విఘ్నేష్ నిస్వార్థ ఫౌండేషన్‌లో ఉచితంగా రెండేళ్ల ప్రత్యేక శిక్షణ పొందినట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ తెలిపారు. విఘ్నేష్‌ను హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయురాలు ఎలిజబెత్ రాణి అభినందించారు.

నేడు 'అమ్మ' హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని చంద్ర హాస్పిటల్ సమీపంలో నూతనంగా నిర్మించిన అమ్మ హాస్పిటల్‌ను నూతన యాజమాన్యం సమక్షంలో గురువారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ టి.శివజ్యోతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న తాము ఆత్యాధునిక సౌకర్యాలతో మరింత మెరుగైన వైద్యం అందించే క్రమంలో అమ్మ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలు అందిస్తామన్నారు.

అమ్మ ఆసుపత్రి



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమతంగా ఉండాలని ఉమ్మడి అనంతరం జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు ఆదేశించారు. నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో బుధవారం పుట్టపర్తి, అనంతపురం జిల్లాల సబ్ యూనిట్ మలేరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా సబ్ యూనిట్ అధికారులు పిహెచ్‌సి వైద్యాధికారుల సహాయ సహకారాలతో ఇంటింటికీ తిరిగి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించాలన్నారు. కేసుల నివారణకు మాస్ సర్వే తప్పక చేయించాలన్నారు. తమ అనుమతి లేకుండా, తమకు తెలుపకుండా ప్రయివేటు నర్సింగ్ హోంలు డెంగీ, మలేరియా వ్యాధులను నిర్ధారణ చేయకూడదని హెచ్చరించారు. 5వేల జనాభా కలిగిన గ్రామాల్లో ప్రతి 15 రోజులకు ఓ సారి దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఓబులు

హై రిస్క్ గ్రామా ల్లో ముందు జాగ్రత్త చర్యగా దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఫీవర్ సర్వే చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారులు కె.సత్యనారాయణ, లక్ష్మీ నాయక్, ఎంపిహెచ్ఒలు కె.గిరిధర్‌రెడ్డి, రామాంజనేయులు, బత్తుల కోదండరామిరెడ్డి, తిరుపాల్, జయరామ్‌నాయక్, శివయ్య, మద్దయ్య, సి.శ్రీనివాసులు, మునాఫ్, షమీఉల్లా, హెల్త్ సూపర్వైజర్లు పివి.రాఘవేంద్రరెడ్డి, రమేష్, లోకేశ్వర్‌రెడ్డి, నూరుబాషా, శ్రీధర్, శశిధర్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు సమస్యల సాధనకు పాదయాత్ర చేపట్టినట్లు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంతో పాటు మండలంలోని లత్తవరం, షేక్షానుపల్లి, కోనాపురం, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు, మోపిడి, ఆమిద్యాల, నింబగల్లు, రేణుమాకులపల్లి, బూదగవి, ఇంద్రావతి గ్రామాల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వాల కళ్లు తెరిపించేలా పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి జి.శీనప్ప, మురళి, వీరాంజనేయులు, రవికుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు

పాదయాత్ర పోస్టర్ విడుదల

విడపనకల్లులో కౌలు రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. కౌలు రైతు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్, బిసి, ఎస్సీ కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. ఆయా సమస్యలపై ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ చేపట్టనున్న పాదయాత్రలో రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు అశోక్, శంకరయ్య, స్వామి, చంద్ర, తిప్పన్న పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలకు డిమాండ్


ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పారిశుధ్యం నిర్వహణపైప దృష్టి సారించని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్న ప్రిన్సిపల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హారుణ్‌రషీద్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థినులు ఉన్నారని, పాఠశాలలో పరిశుభ్రత లోపించినా ప్రిన్సిపల్ చూసీచూడనట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, ఆవరణలోకి విషపురుగులు వస్తున్నాయని, బాత్ రూంలు దుర్వాసన వస్తున్నాయని, దోమలు వృద్ధి చెంది విద్యార్థులు విష జ్వరాల బారిన పడినా ప్రిన్సిపల్ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, వంశీ, అశోక్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌తో ఎమ్మెల్యేలు భేటీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్/పుట్లూరు

ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ బుధవారం వేర్వేరుగా కలిశారు. ఎమ్మెల్యేలు వారి, వారి నియోజకర్గాలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యేలు సునీత, బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ కమిషనర్

నాటుసారాను నిర్మూలించాలి

ప్రజాశక్తి-గుత్తి

నాటుసారాను సమూలంగా నిర్మూలించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదేశించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జక్కలచెరువు, బసినేపల్లి తండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాటుసారా, మద్యం తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిం చారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే కళాజాత బృందంచేత గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి రామ్మోహన్‌రెడ్డి, సిఐ ఇ.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూగర్భజలాలను పెంపొందించేందుకు ఉపాధి హామీ ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, తదితర ఉపయోగపడే పనులు చేపట్టవచ్చు అన్నారు. వీటి వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రజలకు వీటిపై అవగాహన కల్పించి పనులు చేపట్టాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. పశువుల షెడ్ల నిర్మాణంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.లక్ష్మీనరసింహ, ఏపీవో సుజాత, టిఎలు గంగలక్ష్మి, ఈశ్వరమ్మ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ పరిధిలోని ధోనిముక్కల రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ బృందం బుధవారం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 17 ఏళ్లయినా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రెయినేజీలు, తదితర వసతులు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాముడురాయల్, నాయకుడు దాసరి శ్రీనివాసులు, ఎఐటియుసి మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు వినోద్, మధు, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌హెచ్ఆర్ విద్యా విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ఎస్‌హెచ్ఆర్) విద్యా విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం నిర్వహిం చిన సమావేశంలో ఆ సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి, జిల్లా న్యాయ సలహాదారు లాయర్ ఓబుళపతి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కేశవ్ సమక్షంలో చంద్రమోహన్‌ను జిల్లా విద్యా విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఎక్కడా హక్కు ల ఉల్లంఘనలకు తావు లేకుండా ఎన్ఎస్‌హెచ్ఆర్ తరఫున గట్టిగా పోరాడాలని సూచించారు. విద్యా రంగంలో సమస్యలు, విద్యార్థుల అవసరాలను అవగాహన చేసుకొని



చంద్రమోహన్‌ను అభినందిస్తున్న ఓబుళపతి, తదితరులు

పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించడానికి త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. చంద్రమోహన్ మాట్లాడుతూ సమాజంలో ఏ సమస్య తలెత్తినా ముందుండి పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సభ్యులు మాకే హరీష్, మనోజ్, టింకు, వెంకట్, దస్తగిరి పాల్గొన్నారు.



వైసిపి అధినేత జగన్‌తో సాంబశివారెడ్డి, వెంకటరాముడు

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి సీనియర్ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, వెంకటరాముడు బుధవారం ఆ పార్టీ అధినేత జగన్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు.

జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు తరలివెళ్దాం

ప్రజాశక్తి-శింగనమల

ఈ నెల 14వ తేదీ పిఠాపురంలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ వరుణ్ వాహనాలు ఏర్పాటు చేస్తారన్నారు.

సరస్వతి విద్యామందిర్‌కు చేయూత

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సరస్వతి విద్యామందిరంలో ప్రస్తుతం 7వ తరగతి వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 8, 9, 10వ తరగతులు నిర్వహించేందుకు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. అందుకోసం సాయి ట్రస్ట్ అధ్యక్షుడు, సరస్వతి విద్యామందిరం డైరెక్టర్ డా. విజయసాయికుమార్ తల్లి వై.రుక్మిణి బుధవారం రూ. 10,116 సాయం అందించారు. ఈ మొత్తాన్ని కళాశాల ప్రిన్సిపల్ వసుంధరమ్మ, అకౌంటెంట్ వెంకటేశ్వరమ్మలకు అందచేశారు. అలాగే కళాశాల ఆఫీస్‌కు టేబుల్‌ను అందచేశారు.

8న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో మార్చి 8వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

డిడిఒగా డాక్టర్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

డి.హీరేహాల్ పిహెచ్‌సి డాక్టర్ శ్రావణ్ కుమార్ బుధవారం నూతన డిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆధార్ అప్డేట్ చేయాలని, శిశు మరణాల రేటు తగ్గించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని ఆదేశించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని, సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డాక్టర్ మల్లేశ్వరి, క్లర్క్, నర్సులు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఇఒ హరికృష్ణ తెలిపారు. 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి, బలోపేతం' అంశంపై బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో 8, 9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనుశ్రీ, డి.మేఘనబాయి, సి.రూప ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడంతో ఎంఇఒ హరికృష్ణ, హెచ్‌ఎం వెంకటప్రసాద్ బహుమతులు అందజేశారు. వీరు త్వరలో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, ఇమామ్‌సాబ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేత విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ట్రాక్టర్ బోల్తా.. 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చింతకుంట-కడవకల్లు గ్రామాల మధ్యలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో 8 మంది మహిళా కూలీలు గాయపడ్డారు. వారిలో కడవకల్లుకు చెందిన కుళ్లాయమ్మ, రత్నమ్మ, వెంకటలక్ష్మి, రత్నాలు, లక్ష్మీదేవి, ఈరమ్మ, నగిరి లక్ష్మీదేవి, లీలావతి ఉన్నారు. వారిలో రత్నాలు, లీలావతి, లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా అనంతపురం ఆసుపత్రికి, మిగిలిన వారిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వేరుశనగ పంట, వామి దగ్ధం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని ఇరువెందుల గ్రామంలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు వంక లో నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న రైతు ఎం.బాలగంగిరెడ్డికి చెందిన వేరుశనగ పంటతో పాటు వామికి వ్యాపించాయి. ఈ ఘటనలో 13 ట్రాక్టర్ల పశు గ్రాసం, రెండెకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారు రూ. 5 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు బాలగంగిరెడ్డి కోరాడు.

బిటిపి భూసేకరణకు కేటాయింపులు పెంచండి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

హంద్రీనీవా పథకానికి చేసిన బడ్జెట్ కేటాయింపుల్లో భూ సేకరణకు నిధులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన మాట్లాడుతూ హంద్రీనీవాకు బడ్జెట్‌లో రూ. 2,300 కోట్లు కేటాయించడంతో ప్రాజెక్టు భవి ష్యత్తుపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. అయితే హెచ్ఎన్ఎస్ఎస్ మొదటి దశలో అంతర్భాగంగా చేపడుతున్న జీడిపల్లి, భైరవాణితిప్ప ప్రాజెక్టు భూ సేకరణకు రూ. 60 కోట్లు సరిపోవని, కేటాయిం పులు పెంచి బడ్జెట్ పునర్విభజన చేయాలన్నారు. జీడిపల్లి, బిటిపి పనులు వేగవంతమయ్యేలా బడ్జెట్ లో సవరణలు చేయాలని కోరారు. జీడిపల్లి-భైరవాణితిప్ప, జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టులను



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

ప్రాధా న్యతా క్రమంలో ఏడాదిలోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఐదేళ్లలో గంపెడు మట్టి కూడా ఎత్తని వైసిపి హంద్రీనీవా ప్రాజెక్టును కేవలం రాజకీయాలకు ఉపయోగించుకుందని విమర్శిం చారు. సీమ సాగునీటి రంగానికి వెన్నెముకగా నిలిచిన ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తిచేసి అన్ని చెరువులు నింపాలని కోరారు.

క్యాన్సర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శారదానగర్‌లో ఉన్న క్యాన్సర్ విభాగం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం డిఎంఇ డా. రమేష్‌బాబు, ఒక్టావో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూ ఢిల్లీ నుంచి అసోసియేట్ కన్సల్టెంట్ ప్రభంజన్‌సేథ్ పరిశీలించారు. క్యాన్సర్ విభాగంలో అవసరమైన నిర్మాణాలకు సంబంధించి డ్రాయింగ్స్, ఆర్కిటెక్చరల్ డిజైన్లను నెల రోజుల్లో సిద్ధం చేసి, ఎఇఆర్‌బి అనుమతి కోసం పంపేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ మాణిక్యాలరావుకు సూచించారు. అత్యాధు నిక క్యాన్సర్ చికిత్స పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్



మెడికల్ కళాశాల వద్ద డిఎంఇ రమేష్‌బాబు, తదితరులు

డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట డా. జివి.సతీష్ కుమార్, డాక్టర్ జె.ప్రశాంతి, డాక్టర్ దినకర్, ఎస్.ప్రదీప్, రామకృష్ణన్, ఇంజినీర్లు నవీన్, మెడికల్ కాలేజ్ సిబ్బంది ఉన్నారు.

ఢిల్లీ సెమినార్‌పై ఈవోఆర్డీ హర్షం

ప్రజాశక్తి-నార్పల

దేశ రాజధాని ఢిల్లీలో మార్చి 4, 5 తేదీల్లో జరిగిన మహిళ సాధికార సెమినార్‌లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఈవోఆర్డీ శైలజరాణి హర్షం వ్యక్తం చేవారు. ఆమె మాట్లాడుతూ ఆ సెమినార్‌లో ఎన్నో విషయాలు తెలుసుకున్నానని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళల నాయకత్వం, వారి సామర్థ్యంపై వక్తలు చక్కగా వివరించారన్నారు. తాను తెలుసుకున్న విషయాలన్నీ గ్రామీణ స్థాయిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించి మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఈవోఆర్డీ శైలజరాణి

వారు రాజకీయాల్లో రాణించేలా చేస్తామని తెలిపారు. అనంతపురం జిల్లా నుంచి ఈ సదస్సుకు ఎంపిక చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఈవోఆర్డీ శైలజరాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బేల్దారి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో బేల్దారి పూజారి విజయ్ కుమార్ మృతికి కారణమైన ఆర్‌ఎంపి వైద్య సేవలపై వాస్తవాలు వెలుగులోకి తీసుకొచ్చేలా సమగ్ర విచారణ జరపాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు డిమాండ్ చేశారు. విజయ్ మృతికి ఆర్‌ఎంపి వైద్యమే కారణమని ఆరోపించారు. అయితే అధికార పార్టీ అండతో వాస్తవాలు వెలుగులోకి రాకుండా విజయ్ కుటుంబానికి కేవలం రూ. 3 లక్ష ఇచ్చి పంచాయితీ చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. సంఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత డిఎంహెచ్ఒ మొక్కుబడిగా విచారణ జరపడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. డిఎంహెచ్ఒ వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, లేనిచో ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ఆర్‌ఎంపిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిటాల ట్రస్టు ఆధ్వర్యంలో రాతిదూలం పోటీలు

ఆత్మకూరు : మండలంలోని సనప మాధవరాజులస్వామి పరుస సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు రాతిదూలం లాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ. 50వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. 10వేలను టిడిపి సీనియర్ నాయకులు బాలాజీ అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పౌరాణిక నాటకానికి ట్రస్ట్ తరఫున రూ. 50వేలు అందజేశారు.

సీనియార్టీ జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో ఉంచిన వివరాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీ లోపు తెలపాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ తెలిపారు. ఆయన బుధవారం డిఇఒ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ మండల పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తమ అర్హత, పాఠశాలల వివరాలను పొందు పరిచారన్నారు. డీఈవో బ్లాగ్‌లో ప్రదర్శించిన వివిధ కేటగిరీల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీలో అభ్యంతరాలపై జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో నివృత్తి చేస్తారన్నారు.

ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు

గుత్తి : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయుల నియామకానికి బుధవారం ప్రిన్సిపల్ మల్కిసాబ్, గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 10 ఖాళీలు ఉండగా 30 దరఖాస్తులు చేసుకున్నారు. ప్రిన్సిపల్, ఆర్డీవో అభ్యర్థుల సర్టిఫికెట్లు, అర్హత, విద్యా బోధన, వ్యక్తిగత సామర్థ్యాలు, ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలించారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామక ఉత్తర్వులు అందజేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-అనంతపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఎడి వినోద్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే మంజూరు చేయాలన్నారు. దివ్యాంగులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే అంజనేయులు, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు వసంత కూమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు చెల్లించాలి


ప్రజాశక్తి-నార్పల

మండలంలోని చామలూరు గ్రామంలో ఉపాధి కూలీలకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారన్నారు. పనులు చేసి వారాలు గడిచినా కరువు బిల్లులు ఇవ్వకపోతే ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులను ఇవ్వడంతో పాటు పని దినాలు పెంచాలని, కూలీలందరికీ పనులు కల్పించాలని, పని ప్రదేశంలో నీరు, నీడ, మజ్జిగ, మెడికల్ కిట్లు, తదితర వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యదర్శిగా ఉమాపతి, సహాయ కార్యదర్శిగా రమేష్, 9 మంది సభ్యును కలిపి ఏకగ్రీవంగా గ్రామ శాఖ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి చాపల రామంజి, సుధాకర్, సూరి, నారాయణప్ప, కుళ్లాయమ్మ, అరుణమ్మ, ఇందు, రమాదేవి, పవన్, లక్ష్మీనారాయణ, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అక్బర్‌కు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని సాయినగర్‌లో బుధవారం ప్రముఖ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అక్బర్ సాహెబ్ 87వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అక్బర్ మాట్లాడుతూ 'డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి' సమిష్టి కృషితో మంచి గుర్తింపు పొందిందన్నారు. ఆధునిక టెక్నాలజీ, సౌకర్యాలు, శస్త్రచికిత్సల విషయంలో దేశస్థాయిలో రాణిస్తున్నట్లు తెలిపారు. తాము పొందిన ప్రతి అవార్డు వెనుక తన అంకిత భావంతో పాటు కుటుంబ సభ్యులు, సిబ్బంది తోడ్పాటు ప్రజల ఆదరణ ఉందన్నారు.



అక్బర్‌కు కేక్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

పుట్టినరోజు వేడుకల్లో డాక్టర్ అక్బర్ సతీమణి జహిద అక్బర్, ప్రముఖ కంటి వైద్యులు మురళీకృష్ణ, మిథునరెడ్డి, రాణి ఐశ్వర్య, షాజియా, డాక్టర్ అక్బర్ సాహెబ్ కుమారులు డాక్టర్ అఫ్తాబ్, సిబ్బంది ఆరీఫ్, జాన్, నిజామ్, లక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.